రుద్రవరం రేంజ్ విభజన

- కొత్తగా అహోబిలం రేంజ్
- ప్రణాళికలు సిద్ధం చేసిన అటవీ శాఖ
- అడవులు, వన్యప్రాణుల రక్షణ కోసం...

రుద్రవరం, ఆగస్టు 6 :

జిల్లాలో నల్లమల అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. పరిపాలన సౌలభ్యం, పర్యవేక్షణ సులభతరం కోసం రేంజ్‌లు, బీట్‌గా విభజించేందుకు అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. వన్యప్రాణులపై వేటగాళ్ల దాడులు, అడువుల్లో నేరాలు తగ్గించేందుకు విభజన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదికలు కోరింది. రేంజ్‌లు, బీట్‌ల విస్తీర్ణం తగ్గించి ఫారెస్టు అధికారులకు పర్యవేక్షణ సౌలభ్యం కలిగిస్తున్నది. దీంతో అడవులు, వన్యప్రాణుల సంరక్షణ సులభమవుతుంది. ఈ మేరకు ప్రభుత్వం జిల్లాలో రుద్రవరం రేంజ్‌ను రెండుగా విభజించి కొత్తగా అహోబిలం రేంజ్‌ను తెరపైకి తెచ్చింది. ఈ విభజనతో ఉద్యోగాలు పెరిగే అవకాశం ఉంది.



కొత్తగా ఏర్పాటయ్యే అహోబిలం రేంజ్‌లోని బోరింగ్ బేస్ క్యాంపు చెక్‌పోస్టు



చెలిమ ఫారెస్టు రేంజ్‌లో అభయారణ్యంలో ఆర్చి

రుద్రవరం ఫారెస్టు రేంజ్ స్వరూపం ఇలా

రుద్రవరం ఫారెస్టు రేంజ్ 42113.98 హెక్టార్లలో విస్తరించి ఉంది. రుద్రవరం, నూతల, ఆలమూరు, అహోబిలం, డి.వనిపెంట సెక్షన్ల పరిధిలో 14 బీట్‌లు ఉన్నాయి. కొత్తగా అహోబిలం ఫారెస్టు రేంజ్ కేంద్రంగా ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

రుద్రవరం కొత్త రేంజ్ కింద ఇలా

రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లో కొత్తగా ఏర్పాటయ్యే రేంజ్ ఎరిధిలో రుద్రవరం, నూతల సెక్షన్లు ఉంటాయి. వీటిలో రుద్రవరం సెక్షన్‌లో నాలుగు బీట్‌లు, నూతన సెక్షన్‌లో రెండు బీట్‌లు ఉన్నాయి.

కొత్తగా అహోబిలంలో ఫారెస్టు రేంజ్

రుద్రవరం రేంజ్‌లో నుంచి విభజించి కొత్తగా అహోబిలం రేంజ్ కేంద్రంగా ఏర్పాటు ఇలా చేస్తారు. ఆలమూరు, అహోబిళం, డి.వనిపెంట సెక్షన్లు కేటాయించారు. వీటిలో 9 బీట్‌లు ఉంటాయి. పెద్దవంగలి బీట్‌ను రెండుగా విభజించి కొత్తగా కదిరిపురం తండా బీట్‌గా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ రేంజర్ పోస్టు, ఒక బీట్ ఆఫీసరు పోస్టు పెరుగుతుంది.

చెలిమ రేంజ్ స్వరూపం ఇలా

చెలిమరేంజ్ ఫారెస్టు రేంజ్ 23740.53 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. పచ్చర్ల, పెద్దకంబలూరు, చెలిమ సెక్షన్లు ఉన్నాయి. పచ్చర్ల, దొంగబావి, చెలిమ, బసాపురం, గాజులపల్లె, పెద్దకంబలూరు, కోటకొండ, ఉల్లెడ బీట్‌లు ఉన్నాయి. కొత్తగా చెలిమ బీట్‌ను ఈస్ట్, వెస్ట్‌గా కోటకొండ బీట్‌ను, సౌత్ నార్త్‌గా పచ్చర్ల బీట్‌ను విభజిస్తున్నారు. వీటిలో మూడు బీట్‌లు పెరగడంతో మూడు బీట్ ఆఫీసర్ల పోస్టులు పెరగనున్నాయి.

జిల్లా ఫారెస్టు కార్యాలయం





రుద్రవరం ఫారెస్టురేంజ్ కార్యాలయం

బండి ఆత్మకూరు ఫారెస్టు రేంజ్ ఇలా

బండిఆత్మకూరు ఫారెస్టు రేంజ్ 12865.90 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఓంకారం, బీసీ పాలెం, ఎన్ఆర్‌కుంట సెక్షన్లు ఉన్నాయి. అదనంగా బీసీపాలెం బీట్‌లో కొత్త బీట్ ఏర్పాటు చేస్తున్నారు. పాతవి ఓంకారం నార్త్ సౌత్, ఎన్ఆర్ కుంట నార్త్ సౌత్ ఉన్నాయి. ఈ రేంజ్‌లో ఒక బీట్ ఆఫీసరు పోస్టు పెరుగుతుంది.

నంద్యాల రేంజ్ ఫారెస్టు

నంద్యాల ఫారెస్టు రేంజ్ 19159.98 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. బైరేని, గడి గుండం, (మహానంది) సెక్షన్లున్నాయి. బైరేనిలో మూడు బీట్‌లు, గడిగుండంలో 2 బీట్‌లు ఉన్నాయి. ఇక్కడ కోత మిషన్ల కోసం ప్రత్యేక సెక్షన్ ఉంది. ఇక్కడ నాలుగు పోస్టులు పెరిగే అవకాశం ఉంది. ఫారెస్టు అధికారులు కూడా నాలుగు పోస్టులు కావాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.



నివేదిక పంపించాం

రుద్రవరం రేంజ్‌లో కొత్తగా అహోబిలం రేంజ్ ఏర్పాటు, పెద్దవంగలి బీట్‌లో కదిరిపురం తండా బీట్ ఏర్పాటు కోసం నివేదిక పంపాం. ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నారు. ఒక రేంజ్‌ను రెండు రేంజ్‌లుగా విభజించడం పరిపాలన సౌలభ్యంగా ఉంటుంది. విభజన ఉత్తర్వులు అందుతాయి.

-శ్రీపతినాయుడు, రేంజర్, రుద్రవరం

ముగ్గురు వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు బదిలీ

మహానంది, ఆగస్టు 6: మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు శాస్త్రవేత్తలను రాష్ట్రంలోని ఇతర కళాశాలలకు బదిలీ చేస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కళాశాల శాస్త్రవేత్త కవిత అనంతపురం రేకలకుంటలోని వ్యవసాయ రీసెర్చ్ కేంద్రానికి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికిషోర్ కర్నూలు ఏరువాక కేంద్రానికి బదిలీ అయ్యారు. అలాగే అగ్రానమీ శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డిని శ్రీసత్యసాయి జిల్లా కదిరి వ్యవసాయ రీసెర్చ్ కేంద్రానికి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో అనంతపురం జిల్లా రేకలకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు పవన్‌కుమార్‌రెడ్డి, శివజ్యోతి, కడపజిల్లా ఊటుకూరు వ్యవసాయ కేంద్రం నుంచి కృష్ణప్రియ మహానంది వ్యవసాయ కళాశాలకు బదిలీ అయ్యారు.

సీఐ, ఎస్ఐలపై వేటు

- సీతారామపురం ఘటన నేపథ్యంలో చర్యలు
- సస్పెండ్ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు



శివకుమార్‌రెడ్డి (నంద్యాల రూరల్ సీఐ)



నాగేంద్ర ప్రసాద్(ఎస్ఐ)

మహానంది, ఆగస్టు 6: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన మహానంది మండలం సీతారామపురంలో హత్య ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. వైసీపీ కార్యకర్త సుబ్బరాయుడుని అతి కిరాతకంగా హతమార్చిన సంఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు పోలీస్ అధికారులపై వేటు పడింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్‌లను సస్పెండ్ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 4వ తేదీన సీతారామపురంలో అదే గ్రామానికి చెందిన బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలసి సుబ్బరాయుడిపై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. పోలీసులు ఉండగానే ప్రత్యర్థులు హత్య చేయడం, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం వంటి సమాచారం ఉన్నతాధికారుల విచారణలో తేలింది. ఘటన జరుగుతుందని తెలిసినా పోలీసులు ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా ఈ ఘటనలో మరికొంతమంది పోలీసులపై త్వరలో చర్యలు తీసుకుంటారని సమాచారం. ఇదిలా ఉండగా మహానంది ఇన్‌చార్జి ఎస్ఐగా నాగార్జునరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన గోస్పాడు ఎస్ఐగా కొనసాగుతున్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

కర్నూలు(లీగల్), ఆగస్టు 6: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.వెంకట లీలా శేషాద్రి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటుకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై మంగళవారం స్థానిక లోక్ అదాలత్ కార్యాలయంలో మున్సిపల్, పంచాయితీరాజ్, ఇన్సురెన్స్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్నీ ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు సహకరించాలని అధికారులను కోరారు.

పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

జిల్లా అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 6: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 15న జరిగే పంద్రాగస్టు స్వాతంత్ర్య వేడుకలను విజయవంతం చేద్దామని జాయింట్ కలెక్టర్ సివిష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు వేడుకలపై మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జేసీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా విష్ణు చరణ్ మాట్లాడుతూ ప్రజలందరిలో దేశభక్తి భావాలు పెంపొందిచేలా 78వ స్వాతంత్ర్య వేడుకలును నిర్వహించాలన్నారు. కళాశాల మైదానాన్ని ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ పతాక ఆవిష్కరణ, సాయుధ దళాల మార్చ్‌పాస్ట్, వేదిక, బ్యాక్‌డ్రాప్, వీఐపీ సీటింగ్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక చొరువ చూపాలని ఆర్డీఓ, పోలీసు అధికారులను ఆదేశించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓ, ట్రైబల్ అధికారులను జేసీ ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, డీఆర్డీఏ, హౌసింగ్, వైద్యం, డ్వామా, సంక్షేమం, తదితర అన్ని సంక్షేమ శాఖలు అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటుచేసే శకటాల ప్రదర్శనలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల జారీకి జాబితాను సిద్ధం చేయాలని డీఆర్వోను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఆర్వో పద్మజ, ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు జనన ధ్రువీకరణ పరీక్షలు



చెంచు పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాణ్యం, ఆగస్టు 6: పాణ్యంలోని ఇందిరానగర్‌కు చెందిన చెంచులకు మంగళవారం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో జనన ధ్రువీకరణ పరీక్షలు నిర్వహించారు. ఫోరెన్సిక్ వైద్యుడు డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో 16 మంది చెంచులకు పరీక్షలు నిర్వహించారు. నంద్యాల డివిజనల్ పంచాయతీ అధికారిణి మురళీ కళ్యాణి, పాణ్యం ఎంపీడీవో భాగ్యలక్ష్మి జనన ధ్రువీకరణ పరీక్షలను పరిశీలించారు. ఇందిరానగర్‌లోని దాదాపు 30 మంది చెంచు దివ్యాంగులకు ఆధార్ లేకపోవడంతో పింఛన్‌కు అర్హత పొందలేకపోయారని టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు ఖాదర్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మహబూబ్ బాషా, కృష్ణ, సచివాలయ కార్యదర్శి శివకుమార్, ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.హరికృష్ణ, డాక్టర్ ఆనంద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మైనార్టీలను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం

మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మైనార్టీల సంక్షేమానికి తీవ్ర విఘాతం కలిగిందని, మైనార్టీలందరినీ జగన్ ప్రభుత్వం దగా చేసిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ విమర్శించారు. మంగళవారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2014-2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో స్వర్ణయుగంలా మైనార్టీల సంక్షేమం సాగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం టీడీపీ చేపట్టిన సంక్షేమ పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. విజయవాడలో రూ.80 కోట్లతో టీడీపీ ప్రభుత్వం హజ్ భవనాన్ని మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణాన్ని గాలికొది లేసిందన్నారు. కడపలో హజ్ భవనం నిర్మాణానికి 24 కోట్లు మంజూరు చేసి, 80 శాతం పనులు పూర్తి చేసినా.. జగన్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయలేదన్నారు. గుంటూరులో క్రిస్టియన్ భవనానికి రూ.16 కోట్లు మంజూరు చేసి 50 శాతం పనులు పూర్తిచేస్తే వైసీపీ ప్రభుత్వం ఆ పనులను నిలిపి వేసిందన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చంద్రబాబు సీఎంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. మైనార్టీల సంక్షేమానికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని మంత్రి ఫరూక్ తెలిపారు.

శ్రీశైలానికి 3,71,093 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీశైలం డ్యామ్

శ్రీశైలం, ఆగస్టు 6: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి వరద పోటెత్తడంతో డ్యామ్ క్రస్టుగేట్లను 10 క్రస్టుగేట్లును 12 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 2,60,743 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 60,354 క్యూసెక్కులు మొత్తం 3,21,097 వరద ప్రవాహం వస్తోంది. మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 3,71,093 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883.20 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 205.6627 టీఎంసీలుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 22,406 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,857 క్యూసెక్కులు, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 3,11,790 క్యూసెక్కులు మొత్తం 3,72,053 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

నిండుకుండలా వెలుగోడు జలాశయం

- నేడు గేట్లు ఎత్తివేత
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



నీటితో కళకళలాడుతున్న వెలుగోడు జలాశయం

వెలుగోడు, ఆగస్టు 6: తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయం కృష్ణా జలాలతో నిండుకుండలా దర్శనమిస్తోంది. జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో రావడంతో బుధవారం ఉదయం తెలుగుంగ జలాశయం 2 గేట్లను ఎత్తి గాలేరు నదిలోకి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలుగు గంగ అధికారులు తెలిపారు. గాలేరు నది పరివాహక ప్రజలు, ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు హెచ్చరించారు. ప్రస్తుతం జలాశయానికి 17 వేల క్యూసెక్కుల మేర వరద చేరుతోంది. జలాశయం నుంచి 5100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతామని జలాశయం అధికారులు తెలిపారు. వెలుగోడు జలాశయం సామర్థ్యం 16.95 టీఎంసీలు కాగా ప్రస్తుతం 11.615 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది.

జిల్లా అభివృద్ధికి కృషి చేయండి

ఎస్పీ, కలెక్టర్లకు చంద్రబాబు, పవన్‌ల సూచన

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 6: జిల్లా అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌లకు సూచించారు. విజయవాడలోని జరిగిన రాష్ట్ర స్థాయి కలెక్టర్ల సదస్సులో సీఎం, డిప్యూటీ సీఎంలు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వంపై పెంచుకున్న ఆశలు నెరవేరేలా యంత్రాంగాన్ని నడపాలని వారు అన్నారు. ఒక నిబద్ధత, పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లడమే కాకుండా తమ దృష్టికి వచ్చిన సమస్యల్లో ఏది మంచో ఏదీ చెడో నిర్ధారించుకుని తగిన విధంగా స్పందించాలని పిలుపునిచ్చారు.



ఎస్పీ, కలెక్టర్లతో మాట్లాడుతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్



బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే నేరం



సమావేశంలో మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 6: బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసినా బాల్యవివాహ నిరోధక చట్టం ప్రకారం నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టౌన్ మోడల్ పాఠశాలలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. యుక్త వయస్సు వచ్చే వరకు వివాహాలు చేయరాదని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలను ఖచ్చితంగా పాఠశాలలకు పంపాలని తెలిపారు. సెప్టెంబరు 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయ సేవా సదన్‌లో మున్సిపల్ అధికారులతో, పంచాయతీ రాజ్ అధికారులతో, జీవిత బీమా సంస్థ అధికారులతో న్యాయవాదుల సమీక్ష సమావేశం ఉందని అన్నారు. ఇందులో వీలైనన్ని కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్, శారద, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి అవార్డులకు ఎన్నిక

మంత్రాలయం, ఆగస్టు 6: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్త రాత్రోత్సవాల్లో భాగంగా రాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి 2024 అవార్డులకు ముగ్గురు ప్రముఖులు ఎంపికైనట్లు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీ తెలిపారు. బెంగుళూరు చెందిన బీజీఎస్ అండ్ ఎస్‌జేబీఐటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ప్రకాష్ నాథ్ స్వామీజీ, బెంగుళూరు చెందిన పండితులు విద్వాన్ రఘుపతి ఉపాధ్యాయ, వారణాసికి చెందిన ప్రొఫెసర్ వరాజభూషణ్ వద్నాలు ఎంపికైనట్లు తెలిపారు.

వీఆర్వో మద్దిలేటిని సస్పెండ్ చేయాలి

డీఆర్వోకు డీవైఎఫ్ఐ వినతి


ఇన్‌చార్జి జేసీ, డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 6: ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాల ద్వారా కోట్లు సంపాదించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న కల్లూరు మండలం వీఆర్వో మద్దిలేటిని సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని డీవైఎఫ్ఐ నాయకులు ఇన్‌చార్జి జేసీ మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ వీకర్ సెక్షన్ కాలనీలోని 338 సర్వే నెంబరు, డ్రైవర్స్ కాలనీలోని 79/2బీ సర్వేనంబరు, ఒక్కిర వాగు 55 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములకు అక్రమంగా పాసుపుస్తకాలు చేయించడంలో వీఆర్వో మద్దిలేటి కీలకంగా వ్యవహరించాడన్నారు. 257/1బీ సర్వే. నెంబరులో ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తికి ఆన్‌లైన్ చేయించి ఇస్తానని రూ.5 లక్షలు లంచం తీసుకున్నాడని ఆరోపించారు. ఏ. గోకులపాడులో ఎస్సీలకు దక్కాల్సిన భూమిని ఇతరులకు కేటాయించి అక్రమంగా డబ్బు సంపాదించాడన్నారు. ఇలా కల్లూరు పరిధిలో వందల సంఖ్యలో పట్టాల మార్పిడి, అవినీతికి పాల్పడిన అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతి సొమ్ముతో నిర్మిస్తున్న భవనంపై విచారణ చేపట్టాలన్నారు. వీఆర్వో మద్దిలేటి చేసిన అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి హుశేన్‌బాషా తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కనకాద్రిపల్లె వాసి మృతి

కొలిమిగుండ్ల, ఆగస్టు 6: అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి(65) మృతి చెందాడు. తన సొంత ట్రాక్టర్‌లో నాపరాళ్ల లోడుతో పామిడికి డ్రైవర్‌తో పాటు సూర్యనారాయణ రెడ్డి కూడా వెళ్లాడు. అయితే పెద్దవడుగూరు దగ్గర ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో బండరాళ్ల మీదపడి సూర్యనారాయణ రెడ్డి మృతి చెందాడు. పెద్దవడుగూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన శాఖలో రూ.77 లక్షల బకాయిలు విడుదల

● రైతుల్లో సంతోషం ● జేడీ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 6: ఉద్యాన శాఖలో వివిధ పథకాల కింద లబ్ధి పొందిన రైతులకు గత వైసీపీ ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించాల్సిన మొత్తాన్ని అందించకుండా ఆ నిధులను దారి మళ్లించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో పెండింగ్‌లో ఉన్న ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై పథకాల నిధులను తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యానసమగ్ర అభివృద్ధి మిషన్ పథకం కింద రూ.66,89,019, అదే విదంగా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రూ.15,75,000, 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.77లక్షలు విడుదల చేసినట్లు ఉద్యానవన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకుల అవస్థలు



- రెన్యువల్ ఉత్తర్వులు జారీ ఏదీ...?
- మూడు నెలల జీతాలు పెండింగ్
- ఆందోళనలో అధ్యాపకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 6: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న అధ్యాపకుల సమస్యలను గత వైసీపీ ప్రభుత్వం పరిష్కారం చూపకపోగా.. జిల్లా ఉత్తీర్ణత శాతం ఉత్తర్వులతో అంధకారంలోకి నెట్టివేసింది. ప్రతి ఏడాది అకడమిక్ ఇయర్ ప్రారంభం కాకమునుపే మే నెలలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే అధ్యాపకులకు యథావిధిగా కొనసాగింపు రెన్యువల్ ఉత్తర్వులు ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసేది. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇప్పటికీ అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. వార్షిక పరీక్షల్లో ప్రతి సబ్జెక్టులోనూ జిల్లా ఉత్తీర్ణత శాతంతో విద్యార్థులు పాస్ కావాలనే షరతు విధించింది. ఈ నిబంధన ప్రకారం ఆ సబ్జెక్టు బోధిస్తున్న అధ్యాపకుడు కొనసాగింపునకు అర్హత సాధిస్తాడు. జిల్లా ఉత్తీర్ణత శాతం కంటే ఆ సబ్జెక్టులో తక్కువ మార్కులు వచ్చినట్లయితే రెన్యువల్‌కు అనర్హులు అవుతారు. ఇది ఈ జీవో సారాంశం.

కర్నూలు జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్, కాంట్రాక్టు, గెస్టు అధ్యాపకులు మొత్తం 356 మంది పని చేస్తున్నారు. ఇందులో కాంట్రాక్టు పద్ధతిలో మొత్తం 171 మంది అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరికి గత మూడు నెలల నుంచి జీతాలు అందక ఆందోళన చెందుతున్నారు. కుటుంబాలను పోషించుకోవడానికి అధిక వడ్డీలతో అప్పులు తీర్చలేక, మరో పక్క విధులను నిర్వర్తించడం కష్టంగా మారిందని అధ్యాపకులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల రెన్యువల్ లేక, ఇటు జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్డీయే ప్రభుత్వం అయినా రెన్యువల్ చేసి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు అందించాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి. గత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని చెప్పింది. జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత జీవో జారీ చేశారు. అధ్యాపకుల వివరాలన్నింటినీ సేకరించారు. ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం ఓడిపోవడంతో మా సమస్య అక్కడే ఆగిపోయింది. కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుని రెగ్యులర్ చేయాలి.

\- ఎన్.బ్రహ్మేశ్వర్లు, ఏపీజీజేసీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

● పెండింగ్ జీతాలు చెల్లించాలి



కాంట్రాక్టు అధ్యాపకులకు నెలనెలా ప్రభుత్వం జీతాలు విడుదల చేయాలి. గత 3 నెలల నుంచి జీతాలు అందక అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసిన జిల్లా ఉత్తీర్ణత శాతం నిబంధన తొలగించాలి. ఎలాంటి షరతులు లేకుండా జీతాలు అందించాలి. ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా అధ్యాపకులందరినీ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

\- ఈశ్వర్, ఏపీజీజేసీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ

రైతులకు న్యాయం చేయండి

● హంద్రీనీవా కాలువను పరిశీలించిన సీపీఎం నాయకులు ● పంటనష్టం అంచనాపై నివేదికలు : వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి


పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జే.డీ.వరలక్ష్మి


కోతకు గురైన పంటలను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

వెల్దుర్తి, ఆగస్టు, 6: హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల కాలువకు గండి పడిన నేపథ్యంలో రెండు వందల ఎకరాలకు పైగా పంట నీట మునిగింది.. ఆ రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో 58వ కిలోమీటరు వద్ద శెట్టిపల్లె (మల్లెపల్లె పంప్‌హౌస్) వద్ద హంద్రీ నీవా కాలువకు సోమవారం గండిపడిన విషయం తెలిసిందే. దీంతో ఆర్‌డీవో శేషిరెడ్డి, వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి పంటలను మంగళవారం పరిశీలించారు. అదేవిధంగా సీపీఎం నాయకులు కూడా పంటలతో పాటు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. కాలువ ఆయకట్టుకు ఉన్న మూడు మండలాల పరిధిలో సుమారుగా 200 ఎకరాల్లో నీరు ప్రవహించి భూములు కోతకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సందర్భంగా అధికారులు రైతులతో మాట్లాడారు. రైతులు అధైర్య పడవద్దని, నష్టం మీద నివేదికలు ప్రభుత్వానికి అందజేసి పరిహారం అందేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట ఏడీఏ సాల్‌రెడ్డి, కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్, కోడుమూరు అగ్రికల్చర్ ఏవో రవిప్రకాష్‌గౌడు, వీఆర్‌వోలు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : హంద్రీనీవా కాలువ గండి పడిన ప్రాంతాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ, రామకృష్ణ పరిశీలించారు. కాలువకు గతంలోనే రెండుసార్లు గండి పడినప్పటికీ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదిక మీద చర్యలు తీసుకోలేదని అన్నారు. కాలువ మరమ్మత్తులు వేగంగా చేపట్టి, రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఐటీ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కేంద్ర మంత్రికి ఎంపీ బస్తిపాటి వినతి పత్రం


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 6: నగర శివారులోని ట్రిపుల్ ఐటీ కళాశాలలోని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం డిల్లీలోని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆయన కలిసి వినతి పత్రం ద్వారా పరిష్కరించాలని కోరారు. కళాశాలలో ఖాళీగా ఉన్న 36 బోధన, బోధనేతర పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, అలాగే కళాశాలలో నీరు, రోడ్లు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరారు. ట్రిపుల్ ఐటీ కళాశాల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

శ్రీశైలంలో అగ్ని ప్రమాదం

కొబ్బరి చిప్పల ప్రాసెసింగ్ యూనిట్‌లో మంటలు


చెలరేగుతున్న మంటలు

శ్రీశైలం, ఆగస్టు 6: శ్రీశైలం దేవస్థానం పరిధిలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆలయ సమీపంలోని కొబ్బరి చిప్పల ప్రాసెసింగ్ యూనిట్ కర్మాగారంలో అగ్ని ప్రమాదం సంభవించింది. కొబ్బరి చిప్పలను ప్రాసెసింగ్ చేసే విధానంలో భాగంగా మంగళవారం సాయంకాలం నిప్పులను ఇనుప మంచాల కింద పరచి దానిపై కొబ్బరి చిప్పలను ఆరబెట్టారు. ఈ సందర్భంలో అధిక ఉష్ణోగ్రతతో కొబ్బరి చిప్పలు అంటుకుని అగ్ని ప్రమాదానికి దారి తీశాయి. దట్టమైన పొగ రావడంతో గుర్తించిన స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఫైర్ ఇంజన్‌తో పాటు దేవస్థానం వాటర్ ట్యాంకుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దేవస్థానం సిబ్బంది నివాస గృహాల మధ్య ఈ కర్మాగారం ఉంది. స్థానికులు మంటలను అదుపులోకి తీసుకురాకపోయి ఉంటే పెద్ద ప్రమాదమే సంభవించేది. ఇది ఇలా ఉండగా ఈ కర్మాగారాన్ని శ్రీశైలం శివారులోకి ఏర్పాటు చేయాలని పలుమార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గతంలో కూడా రెండుసార్లు ఇదే కర్మాగారంలో అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న స్థానిక సీఐ ప్రసాదరావు, ఎస్ఐ లక్ష్మణ రావు, దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

కర్నూలు జీజీహెచ్‌కు రికార్డు స్థాయిలో ఓపీ రోగులు

● సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి



కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 6: రాయలసీమకు తలమానికమైన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఇటీవల విస్తరించిన సేవల కారణంగా జూలై నెలలో రికార్డు స్థాయిలో ఓపీ నమోదైనట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. ఆసుపత్రికి గతంలో ప్రతి రోజు 2000 నుంచి 2,500 మంది ఓపీ రోగులు వచ్చేవారని, జూలై నెలలో 2,700 నుంచి 3,000 మంది వచ్చారని అన్నారు. ఏప్రిల్ నెలలో ఓపీ 60,515 మంది, అడ్మిషన్లు 5,387, పరీక్షలకు 1.17 లక్షల మంది వచ్చారన్నారు. జూలై నెలలో ఓపీ రోగులు 79,467 మంది రాగా, అడ్మిషన్లు 7,142, పరీక్షలు 2.40 లక్షల మందికి నిర్వహించినట్లు వెల్లడించారు. జూలై నెలలో అత్యవసర రోగుల కోసం కొత్తగా క్యాజువాల్టీ, ఆర్ఐసీయూ వార్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ఓపీ కేంద్రాలు ఆరు ఉండగా.. వీటి సంఖ్య 12కి పెంచామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేకంగా సెంటర్లు, డిజిటల్ ఓపీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో అల్ట్రాసౌండ్, ఈసీజీలతో పాటు ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలను వేగవంతం చేశామన్నారు. ఈ ఏర్పాట్ల వల్ల కర్నూలు జీజీహెచ్‌లో కార్పొరేట్ స్థాయిలో పోటీ పడుతూ రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యులు, సిబ్బంది, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నిరంతరం సేవలందించడం వల్ల రికార్డు స్థాయిలో రోగులు చికిత్సలు పొందుతున్నారన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

హాస్టల్ భవనంపై నుంచి దూకిన బాలుడు


పరామర్శిస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మమ్మ

కోడుమూరు (రూరల్), ఆగస్టు 6: వసతిగృహంలో ఉంటూ చదవడం ఇష్టంలేని ఓ విద్యార్థి భవనంపై నుంచి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోడుమూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని అమడగుంట్ల బీసీ హాస్టల్ భవనం పైనుంచి దూకి వీరేష్(13) అనే 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దేవనకొండ మండలంలోని పి కోటకొండకు చెందిన కమ్మరి బ్రహ్మయ్యఆచారి, రాధ దంపతులకు ఇద్దరు కుమారులు. ఆ దంపతులు కూలీపనులు చేసుకుంటూ, పూరిగుడిసెలో జీవిస్తున్నారు. పేదరికం కారణంగా కుమారులను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. ఈ మధ్యనే బ్రహ్మయ్య జబ్బుపడటంతో సుమారు రూ.4 లక్షలు వైద్యానికి అప్పులు చేశారు. పూట గడవడమే కష్టంగా ఉన్న ఆ కుటుంబంలో పిల్లల చదువుకు ఇబ్బంది కలుగకుండా హాస్టల్‌లో చేర్పాలనుకున్నారు. గత వారంలో కంబాలపాడు హాస్టల్ పిల్లలిద్దరిని జాయిన్ చేశారు. రెండు మూడు రోజుల అనంతరం పెద్దకుమారుడు వీరేష్ హాస్టల్‌లో ఉండే ఇష్టం లేదని తల్లిదండ్రులతో చెప్పాడు. దీంతో తండ్రి బహ్మయ్యఆచారి దగ్గరి బంధువుల పిల్లలు ఉన్న కోడుమూరు మండలంలోని అమడగుంట్ల హాస్టల్‌లో చేర్చాడు. అయితే హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేని పెద్దకుమారుడు వీరేష్ రెండస్తుల భవనం పైనుంచి కిందకు దూకి తీవ్రగాయాలపాలయ్యాడు.


వీరేష్ (ఫైల్)

దీంతో తీవ్ర గాయాలపాలైన వీరేష్‌ను హాస్టల్ అధికారులు, సమీపంలోనే ఉన్న తండ్రి బ్రహ్మయ్య ఆచారి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ బాలనరసింహులు ప్రమాదఘటనాస్థలాన్ని పరిశీలించారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మమ్మ ప్రభుత్వాసుపత్రి వద్ద విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించారు. జరిగిన ఘటనపై వార్డెన్, అధికారులతో ఆరా తీశారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

● వాహనం సీజ్ ● డ్రైవర్ అరెస్టు ● మరో ఐదుగురిపై కేసు నమోదు


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న జిల్లా సెబ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్

ఆలూరు, ఆగస్టు 6: కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి బోలెరో మ్యాక్స్ కేఏ 34 సీ 9504 వాహనంలో 54 టెట్రా పాకెట్స్ మద్యం బాక్సలను తీసుకువస్తుండగా కురుకుంద గ్రామం సమీపంలో మంళవారం ఆలూరు సెబ్ ఇన్‌చార్జి సీఐ మల్లిక సిబ్బంది గుర్తించారు. వాహనంతో పాటు మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సెబ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూ కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి హొళగుందకు చెందిన దుర్గన్న వివిధ గ్రామాలకు సప్లై చేస్తున్నాడని తెలిపారు. డ్రైవర్ సలీం బాషాను అదుపులోకి తీసుకొని విచారణ చేశామన్నారు.. ఈ కేసులో డ్రైవర్‌తో పాటు హొళగుందకు చెందిన దుర్గన్న, మునసహళ్లికు చెందిన హరి ప్రసాద్, బోయ శేఖర్, మణేకుర్తికి చెందిన మురళి, బళ్లారికు చెందిన హనుమంతులపై కూడా కేసులు నమోదు చేశామని తెలిపారు.

లారీని ఢీకొన్న కంటైనర్

● క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ ● రెండు గంటలు నరకయాతన

చాగలమర్రి, ఆగస్టు 6: మండలంలోని పెద్దబోదనం గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిపై నిలిచి ఉన్న లారీని వెనుకవైపుగా వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ సంఘటన మంగళవారం జరిగింది. ఆళ్లగడ్డ వైపు నుంచి చెన్నైకు వెళ్తున్న లారీ పంచర్ కావడంతో పెద్దబోదనం సమీపంలో ఆగింది. అదే మార్గంలో వెనుక వైపు నుంచి వస్తున్న కంటైనర్ నిలిచి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో కంటైనర్‌లోని డ్రైవర్ మనోహరన్ తీవ్రంగా గాయపడ్డాడు. క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి రెండు గంటల పాటు నరకయాతన పడ్డాడు. స్థానిక టోల్‌ప్లాజా సిబ్బంది, పోలీసులు డ్రైవర్ మనోహరన్‌ను బయటకు తీశారు. గాయపడ్డ మనోహర్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి కౌలు రైతు ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

జూపాడుబంగ్లా, ఆగస్టు 6: అప్పులబాధ తట్టుకోలేక కౌలురైతు సుబ్బరాయుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జూపాడుబంగ్లాలో జరిగింది. గ్రామానికి చెందిన సుబ్బరాయుడు(69) తనకున్న ఎకరా పొలంతోపాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగుచేసేవాడు మూడేళ్ల నుంచి వర్షాలు పడక, పంటలు సరిగా రాక రూ.6 లక్షలు అప్పు అయింది. అప్పులు చెల్లించలేక మనస్తాపానికి గురై సోమవారం పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు 108లో నందికొట్కూరుకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఓబులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ట్రాక్టరు బోల్తా : ఒకరు మృతి

రుద్రవరం, ఆగస్టు 6 : మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనరసయ్య అలియాస్ గుల్లోడు (20) ట్రాక్టరు నడుపుతుండగా అదుపు తప్పి మంగళవారం రాత్రి బోల్తాపడింది. ముకుందాపురం గ్రామ సమీపంలోని ఎర్రచెరువు రస్తాలో ఈ ప్రమాదం జరిగింది. కుటుంబంలో విషాదం అలుముకుంది. పంట పొలానికి దున్నేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

'అందరి సహకారంతోనే సమస్యల పరిష్కారం'



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

జూపాడుబంగ్లా, ఆగస్టు 6: అందరి సహకారం ఉంటే ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. అనంతపురం జిల్లా పామిడి మండలం నుంచి జూపాడుబంగ్లాలో బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు టీడీపీ నాయకులు రవికుమార్ యాదవ్, మద్దూరు సుధాకర్, ఎస్ఎండీ సలాం, నరసింహులు, శాలుబాషా, సుబ్బన్న, వెంకటేశ్వర్లు పాల్గొని పుష్పగుచ్ఛం అందించి శుభాకంక్షలు తెలిపారు.

కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ బదిలీ

నందికొట్కూరు, ఆగస్టు 6: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నందికొట్కూరు చీఫ్ మేనేజర్ సరోజమ్మ కర్నూలుకు బదిలీ అయ్యారు. మంగళవారం స్థానిక కేడీసీసీ బ్యాంక్‌లో సిబ్బంది, సహకార సంఘాల సీఈవోలు, ఖాతాదారులు, డైలీ డిపాజిట్ ఏజెంట్లు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సబ్ డివిజన్ జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు, ఆత్మకూరు కేడీసీసీ బ్యాంకు మేనేజర్ పులిరాజు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ, పగిడ్యాల సొసైటీ సీఈవో ఖజామొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి'

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 6: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా కలెకరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ మెస్, కాస్మెటిక్ బిల్లులు పెంచాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రతాప్, దనుంజయ, జిల్లా ఆఫీస్ బేరర్స్ సురేష్ ఎర్రిస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు మనోజ్‌కుమార్, దినేష్ జిల్లా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎరువులు అందుబాటులో ఉంచాలి'



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, ఆగస్టు 6: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఎరువులు, విత్తన బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు టి. రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం జేసీ సి.విష్ణుచరణ్‌ను కిసాన్ మోర్చా ప్రతినిధుల బృందం సభ్యులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రాజశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, రామకృష్ణ, సాంబశివుడు, తదితరులు ఉన్నారు.

'సీఐని సస్పెండ్ చేయాలి'



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆత్మకూరు, ఆగస్టు 6: నంద్యాల పట్టణంలోని 2-టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో న్యాయవాది సుబ్బరామిరెడ్డిపై దాడి చేసిన సీఐ రాజారెడ్డిని సస్పెండ్ చేయాలని ఆత్మకూరు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గొడుగు రవికుమార్, సీనియర్ న్యాయవాది కంచర్ల గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. సుబ్బరామిరెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం ఆత్మకూరు కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఓ సివిల్ కేసు విషయంలో న్యాయవాది సుబ్బరామిరెడ్డిని పోలీసు జీపులో స్టేషన్‌కు తీసుకెళ్లి దాడి చేయడం సరికాదని అన్నారు. న్యాయవాదులకు రక్షణ కల్పించేలా ప్రొటెక్షన్ చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు నూర్‌అహ్మద్, పుల్లారెడ్డి, గిరిరాజు, అబ్దుల్‌రబ్, నగేష్, లక్ష్మీనారాయణ, మహెబూబ్‌బాషా, సిద్ధిక్ అహ్మద్, రెహమాన్, ఆసీఫ్ అలీఖాన్, నరసింహులు, హుసేన్‌మియా, శివశంకర్ తదితరులు ఉన్నారు.

'ఫీల్డ్ సిబ్బందిదే కీలక పాత్ర'

గోస్పాడు, ఆగస్టు 6: క్షేత్ర స్థాయిలో అన్ని రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేసే బాధ్యత ఫీల్డ్ సిబ్బందిదేనని ఫ్యామిలీ డాక్టర్, ప్రోగ్రామ్ జిల్లా మానిటరింగ్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం గోస్పాడు పీహెచ్‌సీ, దీబగుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఆయా పీహెచ్‌సీల డాక్టర్లు గోపాల్, గోవర్ధన్‌రెడ్డి, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి కామేశ్వరరావు, జిల్లా లెప్రసీ కార్యాలయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌డీఆర్ పాఠశాల యాజమాన్యంపై కేసు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 6: నంద్యాల మండల వెంకటేశ్వరపురం గ్రామంలో ఉన్న ఎస్‌డీఆర్ పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా అర్బన్ సీఐ దస్తగిరి బాబు మంగళవారం తెలిపారు. గత గురువారం రాత్రి పాఠశాలలో ఆ పాఠశాల చైర్మన్ పుట్టిన రోజు వేడుకల్లో ఆహారం తిని వందమంది విద్యార్థులకు వాంతులు విరేచనాలతో అస్వస్థతకు గురైన షయం తెలిసిందే. అయితే ఈ ఘటనను గోప్యంగా ఉంచి పాఠశాలలోనే వైద్య చికిత్సలు అందించన విషయం విద్యాశాఖ అధికారులు దృష్టికి వచ్చింది. కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు పాఠవాలలో విచారణ చేపట్టేందుకు శుక్రవారం రాత్రి వెళ్లిన నంద్యాల డిప్యూటీ ఈవో మహబూబ్ బేగ్ ఎంఈవో బ్రహ్మంను విచారణ చేయించకుండా అడ్డుతగలడం అధికారుల విధి నిర్వహణకు ఆటంకం వంటివి పాఠశాల యాజమాన్యం చేయడంతో డీఈవో ఆదేశాల మేరకు మంగళవారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ అధికారలు ఫిర్యాదు మేరకు పాఠశాల చైర్మన్ కొండారెడ్డితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి బాబు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాణ్యం, ఆగస్టు 6: మండలంలోని నెరవాడ సమీపంలో జరుగుతున్న 33 కేవీ విద్యుత్ సరఫరా పనుల నిమిత్తం బుధవారం ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారి సుందరరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నెరవాడ రైల్వే వంతెన సమీపంలో జరిగే రైల్వే రెండవ మార్గం పనులతో విద్యుత్ పనుల మరమ్మతు చేపట్టినట్లు తెలిపారు. పాణ్యం, బలపనూరు, వడ్డుగండ్ల, రసూళ్లపేట, పిన్నాపురం గ్రామాలలో విద్యుత్ సరఫరాను ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ నిలిపివేతకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 6: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నంద్యాల సెబ్ సీఐ విశ్వనాథరెడ్డి సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై మంగళవారం నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, పీడీ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు: ఎస్పీ

నంద్యాల క్రైం, ఆగస్టు 6: శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. జిల్లాలో నేర నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఎస్పీ మంగళవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ పట్టణంలోని ప్రథమనంది ఆలయ పరిసరాలు, వై జంక్షన్, సంజీవనగర్ గేట్, నందమూరినగర్, వైఎస్ఆర్‌నగర్, ఎస్‌బీఐ కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అంతకుముందు ఆయన విజిబుల్ పోలీసింగ్‌ను ప్రతిరోజు నిర్వహించాలని పోలీస్ అధికారులను టెలికాన్ఫరెన్స్, వీహెచ్ఎఫ్ సెట్ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ నిర్వహించడం వల్ల నేరాలను అరికట్టవచ్చన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలైన అక్రమ మద్యం, గంజాయి, ఇసుక, పీడీఎఫ్ రైస్ తదితర వాటిని అరికట్టవచ్చని అన్నారు. రాత్రి గస్తీని పెంచి దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని, నేర చరిత్ర గలవారి కదలికలను ఎప్పటికప్పుడు కనిపెడుతూ ఉండాలని సూచించారు. గస్తీ సిబ్బందిపై పోలీస్ అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ కొంతమంది వ్యక్తులతో మాట్లాడారు. వారు పట్టణంలో జరిగే కొన్ని సంఘటనలను వారు ఎస్పీ దృష్టికి తెచ్చారు. నంద్యాల పట్టణంలో కొందరు సెల్‌ఫోన్ షాపుల యజమానులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా సిమ్‌కార్డులు, ఐఎంఈఐ నంబర్లు మార్పుచేస్తూ విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే ఈ విషయంపై విచారణ జరపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎన్‌జీవోస్ కాలనీలో కొందరు వ్యక్తులు మోటార్ సైకిళ్లకు నంబర్ ప్లేట్లు లేకుండా, బుల్లెట్ వాహనాలకు పంపిణీ చేసే సైలెన్సర్ లేకుండా అధికశబ్దం



నంద్యాలలో పర్యటిస్తున్న ఎస్పీ

వచ్చేలా చేస్తూ స్థానికులు ఇబ్బంది పడేలా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కూడా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు.

- శిరివెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవిందపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్‌ను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పికెట్‌లోని పోలీసులు, గ్రామస్థులతో స్థానిక పరిస్థితులపై చర్చించారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఇన్‌స్పెక్టర్ రవీంద్ర తదితరులు ఉన్నారు.
- నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్‌లోని పలు రికార్డులను నిశితంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం

నందికొట్కూరు, ఆగస్టు 6: మిడ్తూరు మండల కేంద్రమైన ఏపీ మోడల్ స్కూల్‌లోని మధ్యాహ్నం భోజన పథకాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పరిశీలించి భోజనం నాణ్యత లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మోడల్ స్కూల్‌ను ఎమ్మెల్యే గిత్తాజయసూర్య, పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా, ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చక్కటి విద్యను అందించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత గురించి ఆరా తీశారు. పాఠశాల కాంపౌండ్ గేటు రహదారి నుంచి పాఠశాల వరకు సీసీ రోడ్డు విద్యార్థులకు నీటి సమస్య లేకుండా నూతన బోరును వేస్తామని ఆయన తెలిపారు. ఎంపీడీవో గంగావతి, ఈవోఆర్డీ ఫకృద్దీన్ వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ఖాతా రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు సంపంగి రవీంద్రబాబు, నరసింహగౌడ్, శివరామిరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మిడ్తూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తనిఖీ చేశారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి పరిసర ప్రాంతాలను, ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఆసుపత్రిలో అందించే సేవల గురించి డా. తిరుపతిని



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అడిగి తెలుసుకున్నారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన అధికారులు రద్దు చేసుకొని ఎవరి విధుల్లో వారు ఉండాలన్నారు. పోస్టుమార్టం ఇక్కడే చేసేలా కృషి చేస్తామన్నారు. సర్పంచ్ జయలక్ష్మమ్మ, డా.శారద, భరత్‌కుమార్, సాయిసుధ, వివిధ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, నాయకులు వంగాల శివరామిరెడ్డి, గుండం శివరామిరెడ్డి, రవీంద్రబాబు, నరసింహగౌడ్, మనోహర్‌రెడ్డి, సుధాకర్, శేషిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: జడ్పీ సీఈవో

వెలుగోడు, ఆగస్టు 6: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో నారపు రెడ్డి, బీఎస్ఎన్ఎల్ డీజీఎం రాజేశ్వరరావు విశ్రాంత జడ్పీ సీఈవో జయపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు విద్యార్థి ప్రోత్సాహక అభినందన సభ నిర్వహించారు.వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేవరకు పోరాడాలన్నారు. గత 16 ఏళ్లగా దాతల సహకారంతో విద్యార్థులకు ప్రోత్సాహక అభినందన సభ ఏర్పాటు చేసిపదిలో ప్రతిబ చాటిన విద్యార్థులకు ఎంసెట్, నీట్, బీటెక్, ఎన్ఐటీ, ఐఐఐటి పలు ఉన్నత విద్యలో ప్రతిభ కనబర్చిన మండలంలోని విద్యార్థులకు సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ ప్రతిబ చాటిన విద్యార్థుల కోసం వారు డిగ్రీ పూర్తి చేసేందుకు ఉపకార వేతనాలు, స్కూల్ టాపర్ స్కూల్ ఆల్‌రౌండర్, తెలుగు సబ్జెక్ట్‌లో టాపర్లకు ఆర్థిక ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, సర్పంచ్ జయపాల్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, జడ్పీ సూపరింటెండెంట్ మురళీమోహన్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని, ఎంఈవో బ్రహ్మయ్యఆచారి, ఇమ్మానియేల్, పూర్వ విద్యార్థుల సంఘం



ఉపకార వేతనాలు, ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

నాయకులు రామలింగారెడ్డి, జయరాంరెడ్డి, సుధాకర్‌ఆచారి, సుల్తాన్, నస్రుల్లాఖాన్, శ్రీకాంతరెడ్డి, తదిరతులు పాల్గొన్నారు.

- ప్రతి ఉద్యోగి ప్రజా సేవే ధ్యేయంగా అంకిత భావంతో విధులు నిర్వహించాలని కర్నూలు జడ్పి సీఈవో నారపు రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఏవో మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏవో ఉమర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు : ఏడీఏ

నంద్యాల టౌన్, ఆగస్టు 6: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని ఏడీఏ రాజశేఖర్ డీలర్లను హెచ్చరించారు. మంగళ వారం ఏవో ప్రసాదరావు ఆధ్వ ర్యంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురువడం, కాలువలకు నీటిని వదలడంతో రైతులు సాగులో నిమగ్నమయ్యారని అన్నారు. ప్రతి డీలర్ వారికి కావాల్సిన ఎరువుల జాబితాను ముందుగానే కార్యాలయానికి పంపాలని, వాటి ప్రకారం వ్యాగన్లు వచ్చినప్పుడు ఎరువులను కేటాయిస్తామని చెప్పారు. ఎరువులు కొన్న ప్రతి రైతుకు ప్రతి డీలర్ కచ్చితంగా రసీదు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన పురుగుల మందులను మాత్రమే విక్రయించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అడిగిన ఎరువులను మాత్రమే ఇవ్వాలని, అనవసరమైన ఎరువులను కొనాలని రైతులపై ఒత్తిడి చేయకూడదని ఆదేశించారు. ఏవో ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదీ లోపు డీలర్లందరూ తమ తమ స్టాక్ రిపోర్ట్ ఏవో, ఏడీఏ కార్యాలయాలకు పంపించాలన్నారు.

'గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి'

ఆత్మకూరురూరల్, ఆగస్టు 6: ఆశా కార్యకర్తలు గర్భిణులను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ, వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బైర్లూటి పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా ఆశాల పని తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖుద్దూస్‌బాషా, హెల్త్ సూపర్ వైజర్ రమణమ్మ,ఆయా ఉపకేంద్రాల సీహెచ్‌వోలు హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశాలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'ఎత్తిపోతల మరమ్మతులకు ప్రతిపాదనలు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు

పగిడ్యాల, ఆగస్టు 6: నాగటూరు ఎత్తిపోతల పేజ్-1 పథకం మరమ్మతులకు ఎమ్మెల్యే జయసూర్య రూ.65 లక్షలతో ప్రతిపాదనలు పంపారని టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, కమిటీ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. లక్ష్మాపురం అంచె సమీపంలో మంగళవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాల మరమ్మ తులకు ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి శివానందరెడ్డి రూ.4 కోట్లతో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామనాయుడికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అందులో నాగటూరు ఎత్తిపోతల పథకం పేజ్-1 పథకానికి రూ.65 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే నీటి పారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో గత నెల 3న నూతన కమిటీని ఎర్పాటు చేసుకొని మోటార్లకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కృష్ణానదికి వరుద జలాలు వచ్చి చేరడంతో నాగటూరు ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఏర్పాటైన కమిటీలు రైతుల నుంచి డబ్బు వసూలు చేసుకొని నీటిని విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. గత కమిటీలో జరిగిన అక్రమాలపై కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, కమిటీ సభ్యులు షమిన్, దామోదర్‌రెడ్డి, రైతులు గోవింద్, అయ్యన్న , వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టే కుట్ర'



మాట్లాడుతున్న అబులైస్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 6: దేశంలో ముస్లింల వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టే కుట్ర చేస్తున్నారని ముస్లిం ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్లు ఎస్ఎండీ అబులైస్ అన్నారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణలు చూస్తూ కేంద్ర క్యాబినేట్ ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం నంద్యాలలోని క్రాంతి రేఖ గ్రంథాలయంలో ముస్లిం ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జనరిగింది. ఈ సందర్భంగా అబులైస్, అబ్దుల్ సమ్మద్ వివిధ ముస్లిం ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. వక్ఫ్ చట్టానికి క్యాబినేట్ మీటింగ్‌లో 40 సవరణలు చేసి ఏకపక్షంగా ఆమోదించడం సరికాదన్నారు. ముస్లిం, క్రిష్టియన్ మైనారిటీలు దళిత గిరిజన హక్కులను బీజేపీ కాలరాస్తోందని అన్నారు. ఏపీ, తెలంగాణ, కిస్టియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మన్యం జానయ్య, యూఎంఎల్, ఎస్డీపీఐ, ఇన్సాఫ్, వామపక్షాలు, ముస్లిం సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నందికొట్కూరు, ఆగస్టు 6: మిడ్తూరు మండలం జలకనూరు బాట వద్ద ఓ ద్విచక్రవాహనదారుడు అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలపాల య్యారు. ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలివి.. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన నాగార్జున(45) నందికొట్కూరు నుంచి చాపిరేవులకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి కిందపడడంతో ప్రమాదం జరిగింది. దీంతో గాయాలపాలైన నాగార్జునను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్.ఐ జగన్మోహన్ తెలిపారు.

'వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి'

ఆత్మకూరు, ఆగస్టు 6: పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని పోస్టు మెట్రిక్ వసతిగృహంలో మెనూ పాటించని వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య నాయకులు కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు వసతిగృహాన్ని సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. పోస్టు మెట్రిక్ వసతిగృహంలో మెనూ ప్రకారం పాలకూర పప్పు, కూరగాయలతో కర్రీ, పెరుగు ఉండాల్సి ఉండగా కేవలం పాలకూర పప్పు, నీళ్లమజ్జిగ వడ్డించారని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు తాగేందుకు శుద్ధజలాలు కూడా లేవని తెలిపారు. ఆర్ఓ ప్లాంట్ పనిచేయకపోవడంతో మూలనపెట్టారని ఆరోపించారు. 40మందికిపైగా విద్యార్థులు ఉన్న ఈ హాస్టల్‌లో విద్యార్థులు నిద్రించేందుకు కూడా సరైన వసతుల్లేవని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దేవరాజు, కిరణ్, రాజు, అబ్దుల్లా ఉన్నారు.

'బస్సు సౌకర్యం కల్పించాలి'

ఆత్మకూరు, ఆగస్టు 6: మండలంలోని సిద్ధాపురం గ్రామానికి ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి బస్సు సదుపాయం కల్పించాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున అన్నారు. మంగళవారం స్థానిక డిపో మేనేజర్ మహేంద్రుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సిద్ధాపురం గ్రామం నుంచి 100 నుంచి 150 మంది విద్యార్థులు ఆత్మకూరుకు, వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు వస్తున్నారని అన్నారు. అయితే ఆర్టీసీ బస్సు సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సకాలంలో ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులో లేక విద్యార్థులు విద్యకు దూరం కావాల్సిన దుస్థితి నెలకొందని వివరించారు. నాయకులు రాజు, ముని, ప్రవీణ్, కిరణ్ తదితరులు ఉన్నారు.

కొలను భారతి క్షేత్రంలో భక్తుల సందడి



కొలను భారతి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి, ఆగస్టు 6: నల్లమల్లలో కొలువైన సరస్వతి అమ్మవారి క్షేత్రమైన కొలనుభారతిలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం రెండో రోజు శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ, కుంకుమార్చన, పుష్పార్చన, సహస్రనామార్చణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మోహన్ ఆదేశాల మేరకు పురోహితులు ప్రాతఃకాల సమయంలోనే చదువుల అమ్మకు శారీగోషిణీ నదిజలాలచే అభిషేకాది క్రతువులు నిర్వహించారు. అలాగే భక్తులు తమ చిన్నారులకు ఆలయ ప్రాంగణంలో అక్షర, బీజాక్షర క్రతువులు చేయించుకున్నారు. విచ్చేసిన భక్తులకు స్థానిక ఆర్యవైశ్య సత్ర నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత నెల రోజులుగా ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని భక్తులు రాక వెలవెలబోయిన కొలనుభారతి ఆలయం రెండు రోజుల నుంచి శ్రావణమాసంసందర్భంగా భక్తులతో క్షేత్రం కళకళలాడింది.

సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు

శ్రీశైలం, ఆగస్టు 6: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య(కుమారస్వామి) స్వామికి, నందీశ్వర స్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి స్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళ హారతులు ఇచ్చారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకురాలు హిమబిందు

శ్రీశైలం, ఆగస్టు 6: భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి కర్నూలుకు చెందిన బైరెడ్డి సుభాష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాతలు ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకురాలు టి. హిమబిందుకు అందజేశారు. దాతలను దేవస్థానం అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు.

వెండి పూజా సామగ్రి సమర్పణ



వెండి పూజా సామాన్లు అందజేస్తున్న దాత

శ్రీశైలం, ఆగస్టు 6: శ్రీశైలం మల్లన్నకు మంగళవారం విశాఖ పట్టణానికి చెందిన కె.అవినాష్, సాహిత్యశ్రీ దంపతులు వెండి వస్తువులను సమర్పించారు. వీటిలో 200 గ్రాముల బరువుగల వెండి చెంబు, 200 గ్రాముల బరువుగల వెండిశఠారి, 595 గ్రాముల బరువుగల వెండి నాగహారతి ఉన్నాయి. ఈ విరాళాన్ని దాతలు ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు గంటి రాధాకృష్ణ అవధాని, అమ్మవారి ఆలయ ఉప ప్రధానార్చకులు విజయ్‌కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, గుమాస్తా సావిత్రికి అందజేశారు. దాతలను వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

'ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి'



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్ఏలు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 6: ప్రభుత్వం వీఆర్ఏలకు నైట్ డ్యూటీలు తప్పనిసరి చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని వీఆర్ఏల సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆత్మకూరు డివిజన్‌లోని అనేక్న మండలాల వీఆర్ఏలు నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో మిరియాల దాసుకు వినతి పత్రం ఇచ్చారు. భూపాల్ మాట్లాడుతూ.. వీఆర్ఏలు 24 గంటలు విధులు నిర్వహించాలని ఇచ్చిన ఉత్తర్వులపై ప్రభుత్వం పునరాలోచించాల న్నారు. వీఆర్ఏల సంఘం ఆయా మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఆయా గ్రామాల గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

కిల్కారీ సేవలపై అవగాహన



ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

గడివేముల, ఆగస్టు 6: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో మంగళవారం ఆమె ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించి కిల్కారీ సేలపై అవగాహన కల్పించారు. మాతా శిశుమరణాల నివారణ చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కిల్కారీ వ్యవస్థను అమలులోకి తెచ్చిందని మండల వైద్యాధికారి జబిన్ అన్నారు. కిల్కారీ వ్యవస్థ ద్వారా గర్భిణులకు గర్భదశ 4వ నెల నుంచి పిల్లలు పుట్టిన ఏడాది వరకు ఏ వారం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న సమాచారాన్ని వారానికి ఒక సారి ఉచితంగా సెల్‌ఫోన్ నంబర్‌లకు అందిస్తుందని చెప్పారు. ఈ కిల్కారీ వ్యవస్థపై గర్భిణిలు, బాలింతలకు అవగాహన కల్పించాలని అన్నారు. బాలింతలు, గర్భిణులు కిల్కారీ నుంచి కాల్ పొందలేక పోయినా, వారానికి సంబంధించిన సందేశాన్ని తిరిగి వినాలనుకున్నా 14423కి డయల్ చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'90 రోజుల ఉపాధి పనులకు ప్రతిపాదనలు'


అసంపూర్తిగా ఉన్న గృహాలను పరిశీలిస్తున్న అధికారులు

చాగలమర్రి, ఆగస్టు 6: మండలంలోని పక్కా గృహాల లేఅవుట్‌లలో 90 రోజుల ఉపాధి పనులు కల్పించేందుకు గృహాలను పరిశీలిస్తున్నట్లు ఉపాధి ఏపీవో నిర్మల, హౌసింగ్ ఏఈ షఫీవుల్లా తెలిపారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని లేఅవుట్‌లను పరిశీలించారు. అసంపూర్తిగా, బేస్‌మెంట్‌తో ఉన్న గృహాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పక్కా గృహాలు నిర్మించుకోని, అసంపూర్తిగా ఉన్న గృహాల లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఇంటింటికి వెళ్లి గృహాలు నిర్మించుకోవాలని తెలియజేస్తున్నామన్నారు. ఇళ్లు కట్టుకొనేవారికి 90 రోజుల ఉపాధి పనిదినాలు కల్పిస్తామన్నారు. ఈ సర్వే కోసం 5 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. వారి వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు ఉన్నారు.

'వైద్య సిబ్బంది సేవలు మరువలేనివి'

శిరివెళ్ల, ఆగస్టు 6: సమాజంలోని ప్రజలకు వైద్య సిబ్బంది అందించే సేవలు మరువలేనివని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యులు ముఖేష్ కుమార్, దివ్య, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శిరివెళ్లలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న అమినాబీ పదోన్నతిపై వెళ్తుండడంతో వైద్యులు, సిబ్బంది ఆమెను శాలువా, పూలమాలలతో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గజిటెడ్, నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల ఎన్జీవో ప్రసిడెంట్‌లు మణి శేఖర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, సెక్రటరీ హుసేన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కోవెలకుంట్ల, ఆగస్టు 6: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని హైకోర్టు లాయర్ గాలేసాహెబ్‌గారి ఆలీ హుసేనీ జన్మదిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పేదలు, మధ్యతరగతి ప్రజలు పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. చంద్ర బాబు సీఎంగా, బీసీ జనార్దన్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రం, బనగానపల్లె నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

ప్యాపిలి, ఆగస్టు 6: ప్యాపిలి తహసీల్దార్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన భారతిని మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గత ప్రభుత్వంలో భూదం దాలు, ప్రభుత్వ భూమి ఆక్రమణలు విచ్చలవిడిగా జరిగాయని, అటు వంటి పునరావృతం కాకుండా చూడాలని వారు ఆమెను కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వర రావు యాదవ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, టి శ్రీనివాసులు, ఆర్‌ఈ నాగరాజు, వెంకటరమణాచారి, మోహన్ యాదవ్ ఉన్నారు.

'వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి'

ఆళ్లగడ్డ, ఆగస్టు 6: వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా మార్చాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని వ్యవసాయాధికారులకు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. యాగంటి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పండ్ల తోటల పెంపకం, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రైతులు పాల్గొన్నారు.

'నాణ్యమైన విద్యుత్ అందించాలి'

ఆళ్లగడ్డ, ఆగస్టు 6: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ ఈఈ శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో విద్యుత్ ఏఈ, లైన్‌మన్‌లతో సమావేశం మంగళవారం నిర్వహించారు. విద్యుత్ సిబ్బంది విద్యుత్ భద్రతా నియమాలు పాటించక పోవడం వల్ల ప్రమాదాలకు గురౌతున్నారని, విద్యుత్ సిబ్బంది భద్రతా నియమాలు తప్పక పాటించాలని సూచించారు. విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

డోన్(రూరల్), ఆగస్టు 6: డోన్ విజయ గ్యాస్ అధినేత రాజా విజయకుమార్ మంగళవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని అంధుల కాలనీలో అంధులకు, రైల్వేస్టేషన్ పరిసరాల్లో యాచకులకు, నిరాశ్రయులకు దుప్పట్లు అందజేశారు. ఆయన వెంట రోటరీ క్లబ్ సభ్యులు, గ్యాస్ సిబ్బంది ఉన్నారు.

లారీ, ట్రాక్టరు ఢీ
గంటపాటు ట్రాఫిక్ జామ్


ట్రాక్టరును ఢీకొన్న లారీ

కొలిమిగుండ్ల, ఆగస్టు 6: మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామం వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం లారీ, ట్రాక్టరు ఢీకొనడంతో ఇరు వాహనాల డ్రైవర్లకు గాయాలయ్యాయి. నాపరాళ్ల లోడుతో వస్తున్న ట్రాక్టరు మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో లారీ ముందు భాగం దెబ్బతినింది. ఎన్‌హెచ్-544డి ప్రధాన రహదారి కావడం, రెండు వాహనాలు ఇరుక్కు పోవడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. గ్రామంలో వాహనాలు సైడ్‌కు వెళ్లడానికి దారి లేకపోవడంతో సుమారు గంటపాటు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు చర్యలు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు.

'రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలి'

కోవెలకుంట్ల, ఆగస్టు 6: పొదుపు గ్రూపు మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించేలా చూడాలని ఏపీఎం గురుస్వామి సీసీలను, బుక్‌కీపర్లకు సూచించారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని వెలుగు ఏపీఎం కార్యాలయంలో కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన వెలుగు సిబ్బందికి, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలు తీసుకున్న రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, మేనేజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేశారు

సబ్ రిజిస్ట్రార్ తీరుపై
ఉడుములపాడు రైతుల ఆగ్రహం

డోన్, ఆగస్టు 6: ప్రొహిబిటెడ్ భూమిని రిజిస్టర్ చేయకూడదన్న నిబంధనలను తుంగలో తొక్కి, ఉడుములపాడు గ్రామ పరిధిలో 22ఏలో ఉన్న ఐదెకరాల అసైన్డ్ భూమిని బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ రిజిస్టర్ చేశారు. డోన్ మండలంలోని ఉడుములపాడు గ్రామ పరిధిలోని జగనన్న లేఅవుట్ పక్కన వాములమ్మ అనే మహిళకు గతంలో ఐదెకరాల డీ పట్టా భూమిని ఇచ్చారు. అసైన్డ్ భూమి కావడంతో ఇది ప్రొహిబిటెడ్ జాబితాలో ఉంది. 22ఏ జాబితాలో ఉన్న భూములకు ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషన్లు చేయరాదన్న నిబంధనలు ఉన్నాయి. అయితే.. ఇటీవల బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దనియాల బీబీ పేరుతో 176/1 సర్వే నెంబరులో ఐదెకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న సదురు వ్యక్తి దనియాల బీబీ డోన్ తహసీల్దార్ కార్యాలయంలో హద్దులు చూపించాలని దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మంగళవారం మండల సర్వేయర్ సదురు భూమిలో సర్వే చేసేందుకు వెళ్లారు. ఆ భూమిలో సాగులో ఉన్న లక్ష్మన్న,


ఆందోళన చేస్తున్న రైతులు

మాదన్న కుటుంబ సభ్యులు సర్వే అధికారులను అడ్డుకున్నారు. ఈ భూమి మీద ఆధారపడి జీవిస్తున్నామని ఆందోళనకు దిగారు. దీంతో సర్వే చేయకుండానే అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై డోన్ ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యదీప్ మాట్లాడుతూ ఉడుములపాడు గ్రామ పరిధిలోని 22ఏలోని 176/1 సర్వే నెంబర్ భూమిని రిజిస్ట్రేషన్ చేయకూడదన్నారు. బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్‌పై ఆర్డీవో మహేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతా: కోట్ల

బేతంచెర్ల, ఆగస్టు 6: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రం తరహాలో తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం క్షేత్రం సమీపంలో దివంగత డా.బుగ్గన శంకర్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన సత్రాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోట్ల ప్రారంభించారు. డాక్టర్ శివశంకర్ రెడ్డి విగ్రహాన్ని ప్రారంభించి నివాళులర్పించారు. కొన్నేళ్ల కింద శంకర్ రెడ్డి సత్రాన్ని గత ప్రభుత్వం దేవస్థానం స్వాధీనపరుచుకున్నదని అన్నారు. అయితే బుగ్గన ప్రసన్నలక్ష్మి హైకోర్టును ఆశ్రయించి అనుకూలంగా తీర్పురావడంతో దేవస్థానం అధికారులు బుగ్గనప్రసన్నలక్ష్మికి సత్రాన్ని అప్పగించారని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, మాధవి రెడ్డి, టీడీపీ నాయకులు పోలూరు శ్రీనివాసరెడ్డి, రాఘవరావు, టీడీపీ మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, పట్టణ సమన్వయ చైర్మన్ సుధాకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: కోట్ల

ప్యాపిలి: అధైర్య పడవద్దు..అండగా ఉంటామని బాధిత కుటుంబానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని బీసీ కాలనీలో ఇటీవల ప్రత్యర్థుల దాడిలో గాయపడిన బాధిత కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. ప్రత్యర్థులు తన అన్న కుటుంబాన్ని హతమార్చేందుకు కత్తులు, కొడవళ్లతో దాడి చేశారని, వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఈసందర్భంగా బాధితులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. అనంతరం కోట్ల మాట్లాడుతూ ప్రత్యర్థుల దాడిలో గాయపడిన పేట బలరాముడుకు కుటుంబానికి అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ


ప్యాపిలిలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

సింగల్‌విండో అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, రామ్మోహన్‌యాదవ్, ఖజాపీర్, పరమేష్, మధుకుమార్, రాజారవి, చల్లా వీరాంజినేయులు పాల్గొన్నారు.

'ప్రజలకు అందుబాటులో ఉండాలి'

డోన్: ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి లద్దగిరిలోని కోట్ల నివాసంలో ఎమ్మెల్యే కోట్లను ప్యాపిలి, బేతంచెర్ల తహసీల్దార్లు భారతి, ప్రకాష్‌బాబులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తహసీల్దార్లకు పలు సూచనలు చేశారు. ప్రజలు, రైతులు ఎదుర్కొం టున్న సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాల న్నారు.

కోట్లని కలిసిన ఆర్డీవో

డోన్(రూరల్): డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని ఆర్డీవో క్రాంతి కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అంద జేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను ఆర్డీవో మర్యాదపూర్వకంగా కలిశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: అఖిలప్రియ


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

రుద్రవరం, ఆగస్టు 6: ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. రుద్రవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి మండలానికి అభివృద్ధికి కోసం సీఎం చంద్రబాబు రూ.2కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు, రైతులకు మళ్లీ మంచి రోజులు వచ్చాయన్నారు. ఇది టీడీపీ మీటింగ్ కాదు.. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే సమీక్ష అని, పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలపై సర్పంచ్‌లే కాదని, సామాన్యుడు తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. తెలుగుగంగ బ్లాక్ చానళ్లు, డిస్ట్రిబ్యూటరీ చానళ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించడానికి కృషి చేస్తామన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించని ఏజెన్సీలను తొలగించాలని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని 25 మినీ గోకులాలు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసిందని, యూనిట్ల సంఖ్యను పెంచడానికి కృషి చేస్తామని అన్నారు. 20 ఎకరాల నుంచి 30 ఎకరాలు ఉన్న వారికి జాబ్‌కార్డు ఎలా ఇస్తారు?, స్త్రీనిధిపై ఆరా తీశారు. ప్రతి అంశాన్ని విచారించి తమకు నివేదిక ఇవ్వాలని అటు ఉపాధి హామీ, ఇటు వెలుగు అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధి అంశాలు సర్వసభ్య సమావేశంలో చదివి వినిపించారు.

ఎమ్మెల్యేకు సన్మానం: ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మంగళవారం రుద్రవరం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రవీంద్ర ప్రసాద్, ఎంపీ డీవో రామచంద్ర, ఈవో వరలక్ష్మి, ఎంపీపీ బాలస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీవో ప్రతాప్, ఏఈలు శేఖర్, వెంకట్రాముడు, ప్రమోద్, రాకేశ్‌గౌడ్, ఏవో శ్రీకృష్ణ, వైద్యాధికారి శివమోహన్ పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు'

దొర్నిపాడు, ఆగస్టు 6: మండలంలోని ఆయా గ్రామాల్లోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ టీడీపీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందించనున్నట్లు టీడీపీ నాయకులు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సిద్ది సత్యం, బబ్బూరి వెంకటస్వామిలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని విధాలు అభివృద్ధిబాట పట్టిస్తారని అన్నారు. అనంతరం టీడీపీ నాయకులు కొత్తగా సీఐగా బాధ్యతలు చేపట్టిన కంబగిరి రాముడును కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్లూరి నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై సమీక్ష


సీఎంతో సమావేశంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 6: రాష్ట్ర రాజధాని సచివాలయంలో తొలిసారిగా జరిగిన మంగళవారం పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పన శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఆ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు ఆకర్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆ శాఖ అధికారులతో సుదీర్ఘంగా చర్చించినట్లు మంత్రి బీసీ తెలిపారు.

రంఖాశీం స్వామి జియారత్ వేడుకలు

రుద్రవరం, ఆగస్టు 6: మండలంలోని కొండమాయపల్లె గ్రామంలో మంగళవారం రంఖాశీం స్వామి జియారత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొహర్రం పండుగ ముగిసిన తరువాత 21 రోజులకు జియారత్ వేడుకలు నిర్వహించారు. నంద్యాల, కర్నూలు, కడప జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పూలచేరాలు, వెండి గొడుగులు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారుల కోలాటం కన్నులవిందుగా తిలకించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బనగానపల్లె-నంద్యాల ట్రాఫిక్ మళ్లింపు

బనగానపల్లె, ఆగస్టు 6: బనగాపల్లె పట్టణం నుంచి నంద్యాల వెళ్లే వాహనాల రాకపోకలను బుధవారం గోనవరం, భూపనపాడు మీదుగా మళ్లించినట్లు రైల్వే అధికారులు మంగళవారం వెల్లడించారు. బనగానపల్లె-నంద్యాల ప్రధాన రహదారిలోని పాణ్యం వద్ద రైల్వే గేటుకు మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బనగానపల్లె నుంచి నంద్యాలకు వెళ్లే ప్రతి వాహనదారుడు బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 వరకు ప్రధాన రహదారిలో కాకుండా, గోనవరం, భూపనపాడు వయా బలపనూరు మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు.

పంట నమోదుపై శిక్షణ

బేతంచెర్ల, ఆగస్టు 6: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పంట నమోదుపై మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వేసిన పంటలకు ప్రతి రైతు వివరాలను ఈపంటలో నమోదు చేయాలన్నారు. పంట నమోదు చేయడం వల్ల ప్రభుత్వం నుంచి అందే పంట నష్టపరిహారం, బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు పొందుతారన్నారు. కార్యక్రమంలో ఏవోలు మధు, మహ్మద్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోండి

కోవెలకుంట్ల, ఆగస్టు 6: రైతులు సాగు చేసుకున్న పంటలకు ఈ బుకింగ్ నమోదు చేయించుకోవాలని కోవెలకుంట్ల సహాయ సంచాలకుడు సుధాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కోవెలకుంట్ల డివిజను ఆరు మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందికి ఈ-పంట ఇతర పథకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు, కౌలుకార్డు పొందిన రైతులు వారి పేరుపై పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నిరం జన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి భూమా జ్యోతి మంగళవారం సూచించారు. పంట సాగుచేసిన రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి పంట నమోదు చేసుకోవాలన్నారు.

తల్లి పాలు శ్రేష్ఠం


మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్

డోన్(రూరల్), ఆగస్టు 6: పుట్టిన శిశువుకు తల్లిపాలు శ్రేష్ఠమని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ రాంభూపాల్ అన్నారు. తల్లి పాల వారోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తబురుజు పీహెచ్‌సీలో ఆశా వర్కర్లుకు, హెల్త్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ వరకు చేపట్టిన కుష్ఠ వ్యాధి సర్వేలో 65 అనుమానిత కేసులను గుర్తించినట్లు తెలిపారు. వీటిలో ఒక కేసు నిర్ధారణ అయినట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

సంజామల, ఆగస్టు 6: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని బీఎల్‌పీవో రాంబాబు, ఉయ్యాలవాడ ఎస్ఐ రామాంజనేయ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం కమలపురి ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణకు గురి కావడంతో ఎస్ఐ రామాంజనేయ రెడ్డి, ఈఓపీఆర్డీ రాధికారెడ్డి, ఏఎస్ఐ నాగరాజు, ఎంఈఓలు ఈశ్వరయ్య, రాజయ్యతో కలిసి డీఎల్‌పిఓ ఆక్రమణకు గురైన ప్రాథమిక పాఠశాల భవనం స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారులకు ఎన్నోసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో పోలీసులతో సహాయంతో అక్రమ కట్టడాలను తొలగించారు. గ్రామంలో 1942లో ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించారు. అప్పటి భవనం మరమ్మతులకు నోచుకోకపోవడంతో పక్కనే నూతన పాఠశాల భవనం గత పదేళ్ల క్రితం నిర్మించారు. ఇదే అదునుగా భావించిన స్థానికులు విష్ణువర్ధన్ రెడ్డి, శరత్ కుమార్ రెడ్డి, పాత పాఠశాలను పశువుల పాకగా మార్చారు. బైలు స్థలంలో పశు


ప్రభుత్వ స్థలంలో కట్టడాలను తొలగిస్తున్న కూలీలు

వులకు గాడిపొళ్లు ఏర్పాటు చేశారు. వ్యవసాయ పరికరాలతో స్థలాన్ని మొత్తం ఆక్రమించారు. వీటన్నింటిని అక్కడే ఉండి తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించరాదని ఆక్రమణదారులను ఎస్ఐ హెచ్చరించారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి: ఎంపీడీవో

అవుకు, ఆగస్టు 6: గ్రామాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో మల్ రెడ్డి అన్నారు. మంగళవారం అవుకు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గృహ నిర్మాణాలు, ఓడిఎఫ్ ప్లస్, పారిశుధ్యం తదితర అంశాలపై సమీక్షించామన్నారు. వీటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పురోగతి చూపాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామక్రిష్ణవేణి, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరిముల్లా, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో హనీఫా పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల, ఆగస్టు 6: బేతంచెర్ల ప్రభుత్వ ఐటీఐలో మూడో విడత ఐటీఐ ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. కళాశాలలో మిగిలిపోయిన సీట్లు, కోపా, వెల్డర్ ట్రేడర్లకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలలో చేరేవారు పదో తరగతి పాస్ లేదా ఫెయి లైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలోపు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 27న సాయంత్రం 5 గంటలలోపు బేతంచెర్ల ప్రభుత్వ ఐటీఐలో తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 29న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: సీఐ

కొలిమిగుండ్ల, ఆగస్టు 6: మండలంలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని కొలిమిగుండ్ల నూతన సీఐ మద్దినేని రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం కొలిమి గుండ్ల నూతన సీఐగా రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఆళ్లగడ్డ సీఐగా విధులు నిర్వహించే రమేష్‌బాబును ఉన్నతాధికారులు కొలిమిగుండ్లకు బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

అవుకు, ఆగస్టు 6: అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన బెల్లం చెన్నప్ప (44) అనే వ్యక్తి క్రిమిసంహారక మందును తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. చెన్నప్ప రామాపురం గ్రామంలోని నాపరాతి పాలిష్ ఫ్యాక్టరీలో పని చేసేవాడు. మద్యానికి బానిసై భార్యతో గొడవ పడి మధ్యాహ్నం ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య మరియమ్మ, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల మధ్య ఘర్షణ

ప్యాపిలి, ఆగస్టు 6: రేషన్ దుకాణం కోసం తెలుగు తమ్ముళ్లు ఘర్షణ పడ్డారు. ఈ ఘటన మంగళవారం పట్టణంలోని షాదీఖానా ఆవరణలో జరిగింది. రేషన్ దుకాణాల కోసం షాదీఖానాలో మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అయితే అలేబాదు తండా గ్రామానికి సంబంధించిన రేషన్ దుకాణం విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకొని భౌతిక దాడులు చేసుకున్నారు. అక్కడున్న నేతలు సర్దిచెప్పడంతో ఘర్షణ సద్దుమనిగింది.

బాలిక అదృశ్యం

రుద్రవరం, ఆగస్టు 6: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక మంగళవారం అదృశ్యమైనట్లు ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు. ఆ బాలిక అదే గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యను అభ్యసిస్తోంది. మంగళవారం పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు: మండలంలోని చిత్రరేణిపల్లె గ్రామానికి చెందిన జంగం భూదేవి అలియాస్ అపర్ణ అనే మహిళపై అదే గ్రామానికి చెందిన మేకల కర్ణ అసభ్యకరంగా ప్రవర్తించారని ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్ణపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హాస్టళ్లలో విద్యార్థినుల అవస్థలు


బిందెతో నీటిని మోసుకొస్తున్న విద్యార్థిని

కోవెలకుంట్ల, ఆగస్టు 6: విద్యార్థినులకు అన్ని వసతులు కల్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాల్సిన వెల్ఫేర్ హాస్టల్ అధికా రులు, సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యార్థినులు బయటి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. కోవెలకుంట్ల పట్టణం లోని వెలగటూరుకు వెళ్లే రహదారిలో ఎస్సీ బాలికల హాస్టల్‌లో 70 మంది బాలికలు ఉన్నారు. తాగునీటి కోసం హాస్టల్ లోపల ఏర్పా టు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు లాక్‌డౌన్ కాలం నుంచి పని చేయడం లేదు. దీంతో గ్రామపంచాయతీ నీటిని తాగేందుకు, వాడుక అవసరాలకు విద్యార్థినులు ఉపయోగిస్తున్నారు. హాస్టల్ సమీపంలో ఉన్న మినరల్‌వాటర్ ప్లాంటు వద్దకు వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకుం టున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మినరల్ వాటర్ ప్లాంటు కు మరమ్మతు చేయించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరు తున్నారు. ఈ విషయంపై వార్డెన్ వనజాక్షిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, ప్రస్తుతం సిబ్బంది తక్కువగా ఉన్నందు వల్ల విద్యార్థినులు బయటికి వెళ్లి బిందెలతో మంచినీరు తెచ్చుకుంటున్నారని అన్నారు.

సారా విక్రేత అరెస్టు.. రిమాండ్

బేతంచెర్ల, ఆగస్టు 6: మండలంలోని గూటుపల్లె గ్రామానికి చెందిన సీలం శ్రీరాములు అనే సారా విక్రేతను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసూం వలి మంగళవారం తెలిపారు. గూటుపల్లె గ్రామానికి చెందిన శ్రీరాములు రెహిమాన్‌పురం రైల్వేగేటు వద్ద నాటుసారా విక్రయాలు చేస్తున్నాడన్న సమాచారం రావడంతో దాడులు చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి డోన్ కోర్టులో నిందితున్ని హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించిందన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఆళ్లగడ్డ, ఆగస్టు 6: ఆళ్లగడ్డ పట్టణ సీఐగా చిరంజీవి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తుండిన రమేష్‌బాబు కొలిమిగుండ్లకు బదిలీ అయ్యారు. సీఐ చిరంజీవి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

బనగానపల్లె, ఆగస్టు 6: బనగానపల్లె పట్టణానికి చెందిన వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి రూ.30 వేలు ఆర్థిక సాయం అందించినట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు నారాయణ మంగళవారం తెలిపారు. టీడీపీ నాయకులు టంగుటూరి శీనయ్య, బండి మౌళీశ్వరరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, మీరాపురం గోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో బాధితులకు నగదును అందజేశారు.

'రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి'

దొర్నిపాడు, ఆగస్టు 6: మండలంలోని ఆయా గ్రామాల్లోని రెవెన్యూ సమస్యల పరంగా పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ సుభద్ర అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లోని రేషన్ డీలర్లు తహసీల్దార్ సుభద్రకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువ, పూలమాలలతో సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని అన్నారు.

'రైతుల సమస్యలపై దృష్టి పెట్టండి'

ఉయ్యాలవాడ, ఆగస్టు 6: రైతుల భూ సమస్యలపై దృష్టి పెట్టాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయా గ్రామాల వీఆర్వోలతో ఆయన సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఆర్ఐ సత్తార్ ఉన్నారు.